సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్

సిద్దిపేట.. అభివృద్ధి కోట

- నాడు కరువుకు నెలవు.. నేడు కల్పతరువు
- రంగనాయకసాగర్‌తో సాగునీరు పుష్కలం
- దశాబ్దాల జిల్లా కేంద్రం, రైలు కలలు సాకారం
- ఆదర్శంగా హరీశ్‌రావు నియోజకవర్గం

ఉమ్మడి పాలనలో గుక్కెడు నీటికి నోచుకోని ప్రాంతం సిద్దిపేట.. జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని నాలుగు దశాబ్దాలు పోరాడిన గడ్డ సిద్దిపేట. రైలు సౌకర్యం కోసం సుదీర్ఘకాలం ఎదురుచూసిన నేల సిద్దిపేట. ఇలా కొన్నేండ్లపాటు సిద్దిపేట ప్రజలు పడిన కష్టాలు స్వరాష్ట్రంలో తీరాయి.

> నాడు కరువుకు నెలవుగా ఉన్న సిద్దిపేట నేడు కల్పతరువుగా మారింది. రంగనాయకసాగర్‌తో పుష్కలంగా సాగునీరు రావడంతో పచ్చని పంటలతో తులతూగుతున్నది. ఏండ్లనాటి సిద్దిపేట జిల్లా కల సాకారమైంది. అన్ని రంగాల్లో సిద్దిపేట అభివృద్ధికి కోటగా మారింది.

సిద్దిపేట, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఒక్క పంట పండించడానికే ఆపసోపాలు పడ్డ సిద్దిపేట నేడు మూడు పంటలు పండిస్తున్నది. రంగనాయకసాగర్‌తో కాళేశ్వరం జలాలు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాములను నింపడంతో పంటల సాగు పండుగగా మారింది. 2014 సంవత్సరానికి ముందు సిద్దిపేట నియోజకవర్గవ్యాప్తంగా 19 వేల ఎకరాల్లో సాగైన వరి పంట.. నేడు 90 వేల ఎకరాలకు చేరింది. సిద్దిపేట శివారులో నిర్మించిన రంగనాయకసాగర్ రిజర్వాయర్‌తో ఈ ప్రాంతంలోని బీడుభూములన్నీ పచ్చని మాగాణాలయ్యాయి. ఈ రిజర్వాయర్‌తో వ్యవసాయంతో పాటు పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. రంగనాయకసాగర్ టూరిజం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.125 కోట్లు కేటాయించింది. ఇంటర్నేషనల్ టూరిజం డెస్టినేషన్ సెంటర్‌గా మార్చడానికి మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారు. సిద్దిపేటను జిల్లాకేంద్రం చేయాలని 1984లో నాటి సీఎం ఎన్టీఆర్‌కు చేసిన వినతి బుట్టదాఖలు కాగా, స్వరాష్ట్రంలో 2016 అక్టోబర్ 16న జిల్లా సాకారమైంది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్ని వనరులు సమకూరాయి. నూతన సమీకృత కలెక్టరేట్ భవనంతో పాటు ప్రధాన శాఖల కార్యాలయ నూతన భవనాల్లోనే పాలన సాగుతున్నది. ఇటీవలనే రైలు సిద్దిపేట వరకు ప్రారంభమైంది. రోజుకు నాలుగు ట్రిప్‌లు సిద్దిపేట- సికింద్రాబాద్ మధ్యన నడుస్తున్నది.

సిద్దిపేటకు మెడికల్ కళాశాల

సిద్దిపేట హెల్త్ హబ్‌గా మారుతున్నది. 2018లో కేవలం 150 మందితో ప్రారంభమైన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నేడు 875 మంది చదువుతున్నారు. 13 పీజీ కోర్సుల్లో 61 మంది మెడిసిన్ పీజీ చేస్తున్నారు. బీఎస్సీ పారా మెడికల్ సైన్స్ కోర్సు సైతం అందుబాటులో ఉన్నది. 150 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో ఇంటర్న్‌షిప్ చేస్తూ రోగులకు 24/7 సేవలందిస్తున్నారు. రూ.60 కోట్లతో సకల హంగులతో ఏర్పాటైన ఐటీ టవర్‌లో జిల్లా యువతీ యువకులు 450 మంది విధులు నిర్వహిస్తున్నారు. సిద్దిపేటలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సముదాయం కేసీఆర్ నగర్ జిల్లాకే తలమానికంగా నిలిచింది. నర్సపురం వద్ద ఒకే చోట 45 ఎకరాల విస్తీర్ణంలో 2,460 ఇండ్లను జీ+2 పద్ధతిలో నిర్మించారు. ఒక్కో బ్లాక్‌లో 12, మొత్తం 250 బ్లాక్‌లు ఓకే చోట కట్టించి కష్ట జీవులు ఇచ్చారు. సీఎం కేసీఆర్ సార్ మా దేవుడంటూ వారి ఇంటిలో ఫొటో పెట్టుకొని పూజిస్తున్నారు. హైదరాబాద్ గేటెడ్ కమ్యూనిటీ తరహాలో సకల సౌకర్యాలు కల్పించారు. ఇలా సిద్దిపేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచాయి.

సాగు ఖిల్లా.. చేనేత జిల్లా

ఉమ్మడి పాలనలో సిరిసిల్ల.. ఉరిసిల్లగా ఉండేది. పొద్దున పేపర్ తెరిస్తే నేతన్నల ఆత్మహత్యల వార్తలే కనిపించేవి. ప్రభుత్వాల పట్టింపు లేక చేనేతల జీవితాలు ఛిద్రమైపోయాయి. బొంబాయి, భీవండి వంటి ప్రాంతాలకు నేత కుటుంబాలు వలసెల్లి పోయాయి. ఇక రాబోయే తరాలకు మగ్గం చప్పుడు వినిపించదేమో, నేత వృత్తి కనిపించదేమో అనే దారుణ పరిస్థితులు దాపురించాయి.

ఇలాంటి క్లిష్టపరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. కేటీఆర్ రాకతో సిరిసిల్ల దశ తిరిగింది. చేనేతల జీవితాల్లో కొత్త వెలుగు వచ్చింది. శ్రీరాజరాజేశ్వర, అన్నపూర్ణ ప్రాజెక్టులతోపాటు మల్కపేట రిజర్వాయర్‌తో బంగారు పంటలకు నెలవైంది. అన్ని రంగాల్లో నియోజకవర్గం ప్రగతి పరుగులు పెట్టింది. మొత్తంగా సిరిసిల్ల.. సిరులఖిల్లాగా మారింది.

సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని శ్రీరాజరాజేశ్వర జలాశయం

- మంత్రి కేటీఆర్ సారథ్యంలో మారిన సిరిసిల్ల నియోజకవర్గ రూపురేఖలు
- చేనేత జీవితాల్లో కొత్త వెలుగులు
- కాళేశ్వర జలాలతో బంగరు పంటలు
- సబ్బండ వర్ణాలకు సంక్షేమ ఫలాలు
- తొమ్మిదేండ్లలో సమూల మార్పులు

కరీంనగర్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా, అన్నదాతలు, నేతన్నల ఆత్మహత్యలకు నిలయంగా మారిన సిరిసిల్ల.. నేడు మంత్రి కేటీఆర్ సారథ్యంలో అన్ని రంగాల్లో ప్రగతిపథంలో దూసుకెళ్తున్నది. వ్యవసాయ, పారిశ్రామిక, చేనేత, విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులతో నంబర్‌వన్‌గా నిలిచింది. శ్రీ రాజరాజేశ్వర, అన్నపూర్ణ ప్రాజెక్టులతోపాటు మల్కపేట రిజర్వాయర్, మిషన్ కాకతీయ ద్వారా నియోజకవర్గంలో మొత్తం 1.36 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతున్నది. ఒకప్పుడు డిగ్రీ కాలేజీ మాత్రమే ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఇప్పుడు.. జాతీయ అంతర్జాతీయ కళాశాలలు ఏర్పాటయ్యాయి. వ్యవసాయ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, జేఎన్జీయూ ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ మెడికల్ కళాశాల, రూ.16 కోట్లతో గంభీరావుపేటలో అత్యాధునిక కేజీ టు పీజీ క్యాంపస్ ఏర్పాటుచేశారు. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ, ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ నెలకొల్పారు. సిరిసిల్ల దవాఖానను అన్ని ఆధునిక వసతులతో అప్‌గ్రేడ్ చేశారు. చీర్లవంచ గ్రామ పరిధిలో 366 ఎకరాల్లో రూ.90 కోట్లతో అక్వా పరిశ్రమ, నర్మాలలో 309 ఎకరాల్లో స్పెషల్ పుడ్ ప్రాసెసింగ్ జోన్, సిరిల్లలోని పెద్దూరులో రూ.174 కోట్లతో 60 ఎకరాల్లో అఫెరల్ పార్క్ ఏర్పాటుచేశారు. జిల్లెల్లలో కోల్డ్ స్టోరేజ్, వేర్ హౌస్ నిర్మాణాలు చేపట్టారు. జాకీ, సమర్థ్ కుట్టు శిక్షణ కేంద్రాల్లో మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. ఆయా కేంద్రాల ద్వారా దాదాపు 20 వేల మందికి ఉపాధి లభిస్తున్నది.

నేతన్నకు చేయూత

> మంత్రి కేటీఆర్ నేతన్నలకు చేతినిండా పని కల్పించడంతోపాటు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తున్నారు. నియోజకవర్గంలోని 30,252 మరమగ్గాలకు, 204 చేనేత మగ్గాలకు జియోట్యాగింగ్ చేయించారు. 904 మంది మరమగ్గాల కార్మికులకు రూ.3.70 కోట్లు మాఫీ అయ్యాయి. ఉపాధి కల్పించడమే లక్ష్యంగా బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫామ్స్, రంజాన్, క్రిస్మస్ గిఫ్టుప్యాక్‌లు, ఇతర వస్త్ర ఉత్పత్తికి సిరిసిల్ల కార్మికులకు ఆర్డర్ ఇప్పిస్తున్నారు. ఒక్కోకార్మికుడు నెలకు రూ.15 నుంచి 20 వేల వరకు వేతనం పొందే అవకాశం కల్పించారు. రూ.11.6 కోట్లతో 10,849 మరమగ్గాలను ఆధునీకరించారు. నేతన్న బీమా ప్రవేశపెట్టారు. నేత కార్మికుడిని యజమానిగా మార్చాలన్న లక్ష్యంతో రూ.387.68 కోట్లతో 88 ఎకరాల్లో వీవింగ్ పార్క్ ఏర్పాటు చేశారు. టెక్స్‌పార్క్‌లో 119 చిన్న తరహా పరిశ్రమలకు రూ.24 కోట్ల విద్యుత్తు రాయితీ మంజూరు చేయించారు. సమీకృత కలెక్టరేట్, పోలీస్ కార్యాలయాలు, సమీకృత మార్కెట్లు, గ్రంథాలయాలు, మహిళ సంఘల భవనాలు, రహదారులు నిర్మించారు. నియోజకవర్గంలో రూ.246.5 కోట్లతో 4,429 డబుల్ బెడ్రూం నిర్మాణాలకు అనుమతులు మంజూరు కాగా ఇందులో 3,219 నిర్మాణాలు పూర్తి చేశారు. వీటిలో ఇప్పటికే 1801 మంది లబ్ధిదారులకు కేటాయించారు. మరో 1418 పంపిణికి సిద్ధంగా ఉండగా, మిగిలినవి నిర్మాణ దశలోఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రయోగాత్మకంగా 60 ప్రభుత్వ పాఠశాలల్లో 12,800 మంది విద్యార్థులకు కంప్యూటర్ చాంప్స్ పేరుతో డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

నేడు సిరిసిల్ల, సిద్దిపేటకు కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభలకు బీఆర్ఎస్ పార్టీ భారీ ఏర్పాట్లు
- ప్రాంగణాల్లో సీఎం, మంత్రులు కేటీఆర్, హరీశ్ కటౌట్లు

హైదరాబాద్/రాజన్నసిరిసిల్ల/ సిద్దిపేట, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సిద్దిపేట, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు తొలుత సిరిసిల్ల, తర్వాత సిద్దిపేట సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొంటారు. ఇందుకు రెండు పట్టణాలు ముస్తాబయ్యాయి. సిరిసిల్ల మొదటి బైపాస్‌రోడ్డులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి అర కిలోమీటరు దూరంలో విశాలమైన స్థలంలో సభకు బీఆర్ఎస్ పార్టీ భారీ ఏర్పాట్లు చేస్తున్నది. గులాబీ జెండాలు, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కటౌట్లతో సిరిసిల్ల పట్టణం గులాబీమయమైంది. జిల్లా నలుమూలల నుంచి లక్ష మందిని తరలించనుండగా, అందుకు అనుగుణంగా ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. సీఎంకు ఘనస్వాగతం పలికేందుకు మంత్రి కేటీఆర్ నేతృత్వంలో ముఖ్యనాయకులంతా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. సిద్దిపేట శివారులోని నాగదేవత గుడి బైపాస్‌లో సిరిసిల్ల వెళ్లే రోడ్డులో మంగళవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సభ ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. లక్ష మందితో జరిగే సభా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. సుమారు 20 వేల మంది విద్యార్థులు, యువకులు, రైతులు, అభిమానులతో బైక్ ర్యాలీ సభా ప్రాంగణానికి చేరుకోనున్నది. సభ ప్రాంగణం చుట్టూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కటౌట్లు పెట్టారు.

విద్యుత్తు కాంట్రాక్టర్ల లైసెన్స్ గడువు పెంపు

- ఐదేండ్లకు పొడిగించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
- తగ్గనున్న రెన్యువల్ రుసుము
- 9 నుంచి అమలులోకి
- మంత్రి జగదీశ్‌రెడ్డికి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వారి లైసెన్స్ గడువును మూడేండ్ల నుంచి ఐదేండ్లకు పెంచింది. దీనితోపాటు లైసెన్స్ రుసుమును భారీగా తగ్గించింది. ఈ మేరకు ఈ నెల 9న జీవో 22ను జారీ చేసింది. ఇది ఆ రోజు నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌లోని కాంట్రాక్టర్లకు ఎంతో ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. వారిలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ శివకుమార్, ఎస్‌కే మాజిద్ అహ్మద్, లైసెన్సింగ్ బోర్డు సభ్యులు పీ సదానంద్, ఎన్ పర్వతాలు ఉన్నారు. దేశంలో విద్యుత్తు కాంట్రాక్టర్ల లైసెన్స్ గడువును ఐదేండ్లకు పెంచిన రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని వారు పేర్కొన్నారు.

మరో 28 మందికి బీఆర్ఎస్ బీఫామ్స్

- ఇప్పటి వరకు 98 మందికి అందజేసిన అధినేత కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు సోమవారం నాటికి బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ 97 మంది అభ్యర్థులకు బీఫారాలు అందజేశారు. సోమవారం ప్రగతిభవన్‌లో మరో 29 మంది అభ్యర్థులు సీఎం కేసీఆర్ జనగామ ప్రజా ఆశీర్వాద సభకు బయలు దేరే ముందు ఇచ్చారు.

కాంగ్రెస్ అంటేనే నయవంచన

- నమ్మకానికి మారుపేరు కేసీఆర్
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో విపక్షాల ఫ్యూజులు ఎగిరిపోతున్నాయ్
- నాడు రేవంత్‌ది ఓటుకు నోటు.. నేడు ఓటుకు సీటు వ్యవహారం
- బీజేపీకి డిపాజిట్ కూడా రాదు
- రాసిచ్చిన స్క్రిప్ట్ చదివిన రాజ్‌నాథ్
- సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావు ఫైర్

సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల ఫ్యూజులు ఎగిరిపోతున్నాయ్. వారికి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదు. సీఎం కేసీఆర్ ఆచితూచి.. కన్న తండ్రిలాగా, కుటంబసభ్యుడిలా ఆలోచించి బీఆర్ఎస్ మ్యానిఫెస్టో తయారు చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కాంగ్రెస్ నుంచి కాపీ కొట్టారని పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతున్నారు. ఎవరి పథకాలు ఎవరు కాపీ కొట్టారో సోయి తెచ్చుకోవాలి' అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సోమవారం సిద్దిపేట ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలించి అక్కడే మీడియాతో మాట్లాడారు. రైతుబంధు రూపకర్త కేసీఆర్ అని, తమ పథకాన్ని కాంగ్రెస్ వాళ్లు కాపీ కొట్టారని విమర్శించారు. నమ్మకానికి మారు పేరు కేసీఆర్ అయితే, నయవంచనకు మారు పేరు కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. రైతు బీమా తరహాలో కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా అనే విధంగా మ్యానిఫెస్టోలో పెట్టారని చెప్పారు. రైతుబీమాతో 1.11 లక్షల మంది రైతులు లబ్ధిపొందారని, పేద ప్రజల ధీమా కోసం కేసీఆర్ బీమా ఉంటుందని తెలిపారు. కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ వంటి పథకాలు తెచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, నేడు సౌభాగ్యలక్ష్మి అనే పథకాన్ని మహిళల కోసం తెచ్చారని వెల్లడించారు.

గాంధీభవన్‌లో ధర్నాలు

కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చూస్తున్నామని, టికెట్లు అమ్ముకుంటున్నారని గాంధీభవన్‌లో ధర్నాలు చేసి దిష్టిబొమ్మలు తగలబెడుతన్నారని, ఢిల్లీలో సైతం రోడ్లెక్కి ధర్నాలు చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. నాడు రేవంత్‌రెడ్డిది ఓటుకు నోటు అయితే.. నేడు ఓటుకు సీటు అనేది రేవంత్‌రెడ్డి నినాదమని ప్రజలు మాట్లాడుకుంటున్నారని చెప్పారు. ఇలాంటి వారికి ఓటేస్తే రాష్ట్రాన్ని కూడా అమ్ముకుంటారని తెలిపారు. మాట్లాడితే కాంగ్రెస్ వాళ్లు ఒక్కసారి అవకాశమివ్వమని అడుగుతున్నారని, రాష్ట్రంలో 11 సార్లు అవకాశమిస్తే ఏమీ చేయలేదని, అందుకే ప్రజలు కేసీఆర్‌కు అవకాశమిచ్చారని చెప్పారు. సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో అనూహ్య అభివృద్ధి జరిగిందికాబట్టే మళ్లీ కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నట్టు తెలిపారు. మళ్లీ హ్యాట్రిక్ కొట్టి సీఎం అయ్యేది కేసీఆర్ మాత్రమే చెప్పారు. కేంద్రంలోని బీజేపీ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలంగాణకు వచ్చి ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి మాట్లాడుతున్నారని, వారు కనీసం డిపాజిట్ తెచ్చుకొనే పరిస్థితి కూడా లేదని చెప్పారు. ఆ పార్టీ కనీసం పోటీలో కూడా నిలువబోదని అన్నారు.

సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లిలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

బీఆర్ఎస్ అభ్యర్థులకు నీరాజనం

బీఆర్ఎస్ బీఫాం అందుకున్న ఎమ్మెల్యే అభ్యర్థులకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారు. అభ్యర్థుల సభలు, సమావేశాలకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు తెలుపుతున్నారు. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకుతన్న గువ్వల బాలరాజు తొలిసారిగా అచ్చంపేటకు రాగా, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అన్ని మండలాల నుంచి దాదాపు 10వేల వరకు బైక్‌లతో ర్యాలీలో అభిమానులు, నాయకులు పాల్గొన్నారు. వనపర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో పర్యటించారు. అక్కడ కనిపించిన ఓ వృద్ధురాలితో ఆయన ఆప్యాయంగా మాట్లాడారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నీతి, నిజాయితీలకే పట్టం కట్టి దొంగల భరతం పట్టాలని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చేనెల 6న సీఎం కేసీఆర్ నారాయణపేటకు రానున్న సందర్భంగా జిల్లా అభివృద్ధి కోసం అద్భుతమైన ప్రకటన చేస్తారని చెప్పారు.

- అచ్చంపేట/నారాయణపేట

డిండి నుంచి అచ్చంపేటకు వస్తున్న బైక్ ర్యాలీలో మోటర్‌సైకిల్ నడుపుతున్న విప్ గువ్వల బాలరాజు

బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు

రుద్రూర్, అక్టోబర్ 16: స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజల మద్దతు వెల్లువెత్తుతున్నది. వచ్చే ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తామని ఇప్పటికే అనేక కుల సంఘాలు స్వచ్ఛందంగా తీర్మానాలు చేయగా.. తాజాగా నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన యాదవ కుల సంఘం కూడా ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించింది. సభాపతికి మద్దతు తెలుపుతూ 55 కుటుంబాల వారు సోమవారం తీర్మానం చేసి, ఆ ప్రతిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డికి అందజేశారు.

గంగులకు జైకొట్టిన ఖాజీపూర్ వాసులు

కొత్తపల్లి, అక్టోబర్ 16 : కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను మరోసారి గెలిపించుకుంటామంటూ కొత్తపల్లి మండలం ఖాజీపూర్ వాసులు ప్రకటించారు. సోమవారం సమావేశమైన వారంతా కారు గుర్తుకు ఓటేసి గంగులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తీర్మానం చేశారు.

బాల్క సుమన్‌కు మహిళల మద్దతు

భీమారం, అక్టోబర్ 16 : మంచిర్యాల జిల్లా భీమారంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తంరెడ్డి నివాసానికి సోమవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు తరలివచ్చి చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి బాల్క సుమన్‌కు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని చూసి మళ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కే పట్టం కడతామని వారు ముక్తకంఠంతో నినదించారు.

తెలంగాణ ప్రభుత్వం
సాంకేతిక విద్యా శాఖ
ఫైల్ నం. CTE-ACD1/CTIs/1/2023-ACADEMIC-I నోటిఫికేషన్
2024-2025 సంవత్సరానికి సంబంధిత CTI ల గుర్తింపు కొరకు రాష్ట్రంలోని టైప్‌రైటింగ్ మరియు షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్/కమర్షియల్ మరియు టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌ల ప్రిన్సిపాల్స్ నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. 2) ఈ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ఫీ చెల్లింపు మరియు పూర్తి చేసిన దరఖాస్తుల దాఖలుకు ఆఖరి తేది: ఎ) లేట్ ఫీజు లేకుండా పూర్తిచేసిన దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేది: 30.10.2023. బి) రూ. 300 లేట్ ఫీజుతో పూర్తిచేసిన దరఖాస్తుల స్వీకరణకు ఆఖరి తేది: 04.11.2023. సి) రిజిస్ట్రేషన్ ఫీజు: రూ. 500/- ఒక సంవత్సరానికి / రూ. 1000/- *రెండు సంవత్సరాలకు. * ఈ నోటిఫికేషన్ జారీ తేదీ నాటికి ఐదు కంటే ఎక్కువ సంవత్సరాలుగా ఉన్న ఇన్‌స్టిట్యూషన్లు రెండు సంవత్సరాలకు గుర్తింపు కొరకు దరఖాస్తు చేయుటకు అర్హులు. 3) తదుపరి వివరాలకు https://dte.telangana.gov.in
DIPR RO.No. 2082-DP/CL/ADVT/1/2023-24, Dt: 16.10.2023 సం/- కమిషనర్ తరపున